# జీవన్మృతుడు

—: రచన: —
ము. కృష్ణమూర్తి పట్నాయక్

[అడుక్కొనే వాళ్ళలో — గ్రుడ్డి, చొట్టా, తక్కిన యితరుల సంగతి ఎలావున్నా, కుష్ఠు రోగిష్టుల స్థితి వర్ణనాతీతంగ వుంటుంది. దరిద్రదేవి కరాళ పాదాలక్రింద నలుగుతూండడమేకాక, సర్వనాశనానికి పాల్పడిన నయవమని మహారోగం - కుష్ఠురోగం - ఎంతగా పీడిస్తూంటుందో చెప్పతరంకాదు. బాహ్యప్రపంచానికి దూరంగా వుంచబడడమేగాక ప్రజానీకానికి ప్రబలహానికరంగా వుండబోయేవాళ్ళలా పరిగణింపబడతారు. ఈ రోగిష్టులను ఎడంగా వుంచకపోతే - ఆ రోగం, అందరిపై ప్రసరించగలదనే భయం చాల వ్యాప్తమైయుంది. ప్రభుత్వం అడుక్కొనేవాళ్ల విషయమై - ముఖ్యంగా కుష్ఠుబాధితుల విషయంలో శ్రద్ధతీసుకొని తగిన చర్య తీసుకొనవలసిన అవశ్యకత ఎంతైనా వుంది. ప్రభుత్వం దీన్ని గమనించాలి.]

"రఘుపతిరాఘవ రాజారామ్, పతీతపావన సీతారామ్...బాబూ రెండు బియ్యం గింజలు"

పరుపు మీదినుంచి అటునుండి యిటుతిరిగి—"చంప్రాడావెధవ! ఎంత పెద్దనోరు చేస్తూన్నాడు రాక్షసుడీలా! ఇంకా తెల్లవారేకాలేదు, నిద్రిస్తూన్నవాళ్లను చెవులు పగలగొట్టి లేపి అప్పుడే ముష్టని అడుగుతాడు! వేళాపాళాలేదు పాడువెధవకు...ఒరేయ్, పోరాపో, పడుకున్నవాళ్లను లేపేస్తూ ఏమిటీగర్జన్ను?" అంటూ విసుక్కొని రౌద్రంతో ఒక్కగసురు గసిరాడు ఆ యింటాసామి.

మాటలాడక మరలాడు చిన్నబోయి ఆ అభాగ్యుడు. ప్రప్రథమంలోనే దెబ్బతగిలింది,

* * *

"ఈశ్వర్ అల్లా తేరేనామ్, సబ్‌కో సన్మతి దేభగవాన్...అమ్మా రవంతగంజి."

"ఏవరదీ గంజంటూన్నది? ఇంట్లో యింకా వంటేకాలేదు, అప్పుడే గంజికావాలి! వెధవలు గంజి గంజంటూ దినమస్తమూనమూ చెవులు కొరికేస్తారు. ఎక్కడనుండి తేవడం?...అరేయ్, నడురా అటు నడు. గంజీలేదు గింజీలేదు!" సణిగి కోపంతో కళ్లురెండు పెద్దవిచేసి తోలింది ఆ యిల్లాలు.

నిట్టూర్చి నెత్తిమీద చేయి పెట్టుకొని తిరిగాడు అభాగ్యుడు.

* * *

"సీతారామ్, సీతారామ్, సీతారామ్ జై సీతారామ్...బాబయ్యా ఒక కుళ్లినకాయ..."

ఎంత మందికిరా కాయలియ్యడం? ఇక చెంపకాయలే యియ్యగలం కాని మరేదీయివ్వలేం! అవి కావాలంటే యిల్లారా, యిస్తాను!!" పొడుగాటి కఱ్ఱయెత్తి హూంకరిస్తూ ఉరిమాడు ఆ దుకాణదారుడు.

అదరి బెదరి ఆహా అని అక్కడనుండి కదిలాడు అభాగ్యుడు.

* * *

"శ్రీ రఘునందన సీతారామ్, శ్రితజన పోషక జానకిరామ్...అయ్యా ఆకలి...పారేసినది ఏదైనా..."

"ఆఁ ఆఁ, చాలా్రచాలు! అదిగో ఆ పెంటమీదికిపో, కావలసినంత మెక్కొచ్చును! ఇక్కడ యేమీలేదు" వెకిలిగానవ్వుతూ అని, తీక్షణంగా చూస్తూ—"వెధవలు జలగల్లావదలరు. రోజూ యిదేగోల! ఎంతకని యిచ్చేదీ?" అని గొణిగాడు ఆ ఆహారభవనపు అయ్యరు.

అయ్యో అని అడుగుతీసాడు అభాగ్యుడు.

"అయ్యగారూ ఒక రాగికాని. కడుపు మండుకొని పోతోంది. పుణ్యముంటుంది."

"ఛీ—ఛీ, ఎక్కడ చూచినా ఏమిటీ వెధవలు పిశాచుల్లా! కదలనివ్వరు మనిషిని మధ్య త్రోవలో కూర్చుని అసహ్యంగా. ఘూ—ఘూ!..." చీదరించుకొని అసహ్యపడి తుపుక్కున యింత ఉమ్మి మొఖం తిప్పి వినబడ నట్టే నడచిపోయాడు ఆకాంక్షానా పెద్ద వుద్యోగి.

"హాయ్ భగవంతుడా! ఎందుకీ ప్రాణికిలా కష్టాలు పెడతావ్?" కన్నీరుకార్చి లేవలేక లేచాడు ఆ కర్మాగారం త్రోవనుండి అభాగ్యుడు.

మధ్యాహ్నమైంది. ఎండ మండిపోతోంది. ఆకలి జ్వాల అంతకన్నా మించిపోతోంది. దానికితోడు రోగ బాధ, రొష్టుబాధాను.

దాహమైనా కాస్తాతీసుకుందామని మరవద్దకు వెళ్లాడు.

"అరె, జావ్ రేజావ్, దూర్ హటో!" పెద్దగా అరిచాడు ఒకబోడి తురక.

"నీటికి కూడా కరువా?"

ఓ చెట్టు నీడనైనా విశ్రాంతి తీసుకుందామనీ ఒక మఱ్ఱిచెట్టు దగ్గఱకు వెళ్లాడు.

ఐస్‌క్రీమ్ అమ్మేవాళ్లూ, వేరుసెనగలు అమ్మే వాళ్లూ, పాన్ బీడీ సిగరెట్లు చెలామణి చేసేవాళ్లూ, గరమ్‌గరమ్ చా విక్రయించేవాళ్లూ, నిండున్నారక్కడ. వాటినికొని ఆరగించేవాళ్లూ అక్కడవున్నారు. ఇక, యితరులకు—ముఖ్యంగా—యీ ఆభాగ్యుడి లాంటి వాళ్లకు తావెక్కడ దొరుకుతుంది?

మిలటరీవాళ్ల ధర్మాన, దొరికినవాళ్లు విసరి పారే సిన విరిగిన డబ్బా ఒకటి చంకనుంది. ఏ మహనీయుడో (!) తొడిగి చిరిగిపోగా పనికిరానందున పడవేయగా దొరికిన కాన్వాస్ జోళ్లు జుమ్మని ముసిరే ఈగల బారినుండి, మాడ్చేస్తూండే మండేరోడ్డుల బారినుండి తప్పించుకొన వచ్చునే ఆశతో తొడిగినవి కాళ్లకు వున్నై. రోగంతో కుంటైపోయినకాళ్లను సరిగావేయలేక, కట్టెలసాహుకారి తీవ్రకోపతాపాలకు గురిఅయి అర్థించి ఎలాగో సంపాదిం చిన చిన్న వెదురు కఱ్ఱ ఊతకై చేతిలోవుంది. చిరిగి మురి కైన గుడ్డలు లోకుల్ని ఎంతవేడుకొని తెచ్చుకున్నాడో చాలీచాలక నగ్నశరీరాన్ని కాస్తా కప్పియున్నై; పెను గాయాలికి చుట్టబడియున్నై. వర్ణించలేని మహారోగం, వికృతమై అసహ్యమై శరీరాన్నీ, ముఖాన్నీ నానా అట్ట హాసం చేసేసుంది.

"నాలాంటి ప్రాణులకు యీ ప్రపంచంలో చోటు లేదు!" బాధతో ఒక దీర్ఘనిట్టూర్పువిడిచి దుఃఖించాడు.

ప్రక్కనే పారుతోంది నది—స్వర్ణరేఖ, తలెత్తి ఒకమారు దానివైపు చూచాడు. మెల్లగ అడుగులు తీస్తూ ముందుకు కదిలాడు.

రాత్రయింది. చీకటి బ్రహ్మాండంగా వుంది. మనుష్య సంచారం మందమై నిశ్శబ్దంగావుంది. చూస్తే, వాతావరణం చాల భయంకరంగావుంది. దానికితోడు, రంగత్తుంగ తరంగాలతో ఉధృతంగా పారే ఆ గంగమ్మ తల్లి—అలా ఒకమారు చూస్తేనే గడగడ లాడించేస్తోంది. కాని, అతడికి ఆవంతైనా చలింప జేయలేకపోయాయి ఏవీనూ!

"తల్లి, గంగమ్మా! నీలోనైనా నాకుచోటు నిచ్చి శాంతి నిస్తావా?" ప్రార్థనాపూర్వకంగా ఒకమారు ఆ తల్లినిచూచి అన్నాడు. కొన్నిక్షణాల్లో నీ తటాన్ని చేరు కున్నాడు.

తలతిప్పి ఒకమారు అటుయిటూ చూచాడు. ప్రక్క నుండే పెద్ద చెట్టుమీద గ్రుడ్లగూబొకటి అరచి ఎగిరిపో యింది. భగవంతుణ్ణి స్మరిస్తూ గంగలో ఒకదూకు దూకే శాడు ఆ అభాగ్యుడు—జీవన్మృతుడు!

మన ప్రభుత్వం యిలాంటివాళ్లను సంరక్షి స్తుందా?